ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

సూర్యాపేట
5
మంగళవారం 3 డిసెంబరు 2024



» ఏడాది ప్రజాపాలన ఒక్కో అడుగు ముందుకు » రుణమాఫీ, మహాలక్ష్మి సంపూర్ణం
» విద్య, వైద్యానికి ప్రాధాన్యం » ఎత్తిపోతల పథకాల పనుల వేగవంతం
» రోడ్ల మరమ్మతులు, కొత్త నిర్మాణాలు » 6న యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ ప్రారంభోత్సవం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాదవుతోంది. ఉమ్మడి జిల్లాలో 11 సీట్లు సాధించడంతో ఇద్దరు సీనియర్ నేతలు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కీలకమైన మంత్రి పదవులు దక్కాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరుగ్యారెంటీలతో పాటు ఇచ్చిన హామీల ప్రకారం మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రగతి రథాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. ఏడాది కాలంలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్, శాసనమండలి ఎన్నికల షెడ్యూల్ కారణంతో సగం కాలం వృథాగా గడిచి పోగా, మిగిలిన సమయంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రుణమాఫీ, మహాలక్ష్మి పథకాల అమలుతో పాటు, ఏటీసీల ఏర్పాటు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటు, రోడ్లు, ఫ్లైఓవర్లకు నిధుల మంజూరు, ఎత్తిపోతల పథకాల పనుల వేగిరంచేసేలా క్షేత్రస్థాయి పర్యటనలతో మంత్రులు జిల్లాలో పనులకు శ్రీకారం చుట్టారు. ప్రజాపాలనకు ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో పనులు ప్రగతిపై 'ఆంధ్రజ్యోతి' పరిశీలన..

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

రూ.1504.88కోట్ల రుణమాఫీ



నల్లగొండ జిల్లాలో రుణమాఫీ పథకాన్ని నాలుగువిడతలుగా అమలు చేశారు. నాలుగో విడతకు సంబంధించి నవంబరు 30న 21,432 మంది రైతులకు రూ.236.90కోట్ల నిధులను బ్యాంకులకు విడుదల చేశారు. జిల్లాలో మొత్తం నాలుగు విడతల్లో కలిపి 2,09,626 మంది రైతులకు రూ.1504.88 కోట్ల బ్యాంకు రుణాలు మాఫీ అయ్యాయి. ఇంకా జాయింట్ ఖాతాలు, ఆధార్‌సీడింగ్ లేకపోవడం, క్లరికల్ మిస్టేక్స్, బ్యాంకుల జాబితాకు, వ్యవసాయాధికారులు రూపొందించిన జాబితాకు పొంతన లేకపోవడం, ఎన్‌పీఏ కింద ఖాతాలను ప్రకటించడం, రెన్యువల్స్ చేయకపోవడం తదితర కారణాలతో ప్రతి బ్యాంక్ పరిధిలో 1,000 వరకు ఖాతాలకు రుణమాఫీ కాలేదు. జిల్లాస్థాయి కమిటీలు దీన్ని పరిశీలించి సరిచేసి రుణమాఫీ చేస్తే సంపూర్ణత వస్తుందని ఆశిస్తున్నారు.

మహాలక్ష్మీ పథకం కింద 25,08,019మంది ప్రయాణాలు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా అమలవుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడు డిపోల పరిధిలో ఇప్పటివరకు 25,08,019 మంది మహిళలు ఉచితంగా ప్రయాణం కొనసాగించారని ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. ఈ ప్రయాణాల ద్వారా మహిళలకు రూ.14.00కోట్ల వరకు ఆర్థిక ప్రయోజనం కలిగింది.

2.32లక్షల మందికి గృహజ్యోతి అమలు



ప్రభుత్వం ఆరుగ్యారెంటీల్లో భాగంగా అమలుచేస్తున్న గృహజ్యోతిపథకం జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోంది. ఈ పథకం కింద 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే గృహవినియోగదారులకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నారు. నల్లగొండ జిల్లాలో ఇప్పటివరకు 2,32,315 మంది వినియోగదారులు ఉచితవిద్యుత్ పొందుతున్నారు. ఇంకా 7,375 మంది వినియోగదారులు అర్హులైనప్పటికి సాంకేతిక కారణాలతో వారికి ఉచితవిద్యుత్ పథకం అమలవడం లేదు. త్వరలో వారికి కూడా వర్తింపజేస్తామని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

సంక్రాంతి తర్వాత రైతుభరోసా

జిల్లాలో రుణమాఫీ ప్రక్రియ పూర్తవడం, సంక్రాంతి తర్వాత రైతుభరోసా పథకం అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో గత యాసంగిలో అప్పటి రైతుబంధు పథకం కింద 5,13,851 మందికి ఎకరాకు రూ.5 వేల చొప్పున రూ.607.71 కోట్లు అందజేశారు. ఈసారి ఇది పెరగనుండడంతో సుమారు రూ.1,000కోట్ల మేర రైతుల ఖాతాల్లో జమకానుంది. అదేవిధంగా రైతుబీమా కింద ఇప్పటికే జిల్లాలోని 2లక్షల మంది రైతులకు రూ.101కోట్లతో రైతుబీమా పాలసీ చేయించారు. ఇందిరమ్మ ఇళ్లు, రూ.4వేలకు పెన్షన్లు పెంచుతామనే హామీలను ప్రభుత్వం రెండో ఏడాదిలో అమలు చేయాల్సి ఉంది.

పట్టాలెక్కిన ఎస్‌ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులు

గత పదేళ్లుగా నిద్రావస్థలో ఉన్న ఎస్‌ఎల్‌బీసీ సొరంగమార్గం పనులు పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాచరణ అమల్లోకి తెచ్చింది. ప్రధానంగా ఈ పథకం కింద ఇంకా 9.500 కిలోమీటర్ల సొరంగం మాత్రమే తవ్వాల్సి ఉండగా, అందుకోసం అవసరమైన టన్నెల్ బోరింగ్ మిషన్‌లో ఉపయోగించే బేరింగ్, ఇతర ఉపకరణాలను అమెరికా నుంచి తెప్పిస్తున్నారు. ఈ బేరింగ్ తయారీ సంస్థ వద్దకు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్వయంగా వెళ్లి పరిశీలించి ఆర్డర్ ఇచ్చి వచ్చారు. ఈ పథకాన్ని సొరంగం సహా, దిగువన ఉన్న పెండ్లిపాకల, నక్కలగండి రిజర్వాయర్ల పెండింగ్ పనులు సైతం కలుపుకొని 2027 డిసెంబరు నాటికి పూర్తిచేసి ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల ప్రాజెక్టు సందర్శన సందర్భంగా హామీ ఇచ్చారు. అదేవిధంగా దేవరకొండ, మునుగోడు ప్రాంతాలకు సాగునీరిచ్చే డిండి ఎత్తిపోతల పథకాన్ని సైతం ఏదుల రిజర్వాయర్ నుంచి సాగునీటిని తరలించేలా ప్రణాళిక రూపొందించారు. అందుకోసం టెండర్లు కూడా ఆహ్వానించారు. దిగువన పెండింగ్‌లో ఉన్న ఏడు రిజర్వాయర్ల పనులు వేగవంతంగా కొనసాగిస్తున్నారు.



ఉచిత గ్యాస్ పథకం కింద రూ.18.58కోట్ల లబ్ధి



మహాలక్ష్మి పథకం కింద పేద మహిళలకు అందజేస్తున్న ఉచిత గ్యాస్ కింద నల్లగొండ జిల్లాలో 2,343,994 మంది లబ్ధిదారులను గుర్తించారు. వీరికి ఇప్పటివరకు 6,47,822 సిలిండర్లను పంపిణీచేశారు. ఇప్పటివరకు ఈ పథకం కింద రూ.18,58,74,412 సబ్సిడీని వర్తింపజేశారు. మహిళలకు నిత్యావసర వస్తువుగా మారిన వంటగ్యాస్‌ను ఉచితంగా అందజేయడంపై గృహిణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లకు మహర్దశ



నల్లగొండ ఉమ్మడి జిల్లాకే చెందిన రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో జిల్లాలో రోడ్లకు మహర్దశ పట్టింది. ఉమ్మడి జిల్లాలోని 3,621కిలోమీటర్ల మేర ఉన్న బీటీరోడ్లను ఈ రెండేళ్లలో పూర్తిస్థాయిలో మరమ్మతులు, పునర్నిర్మాణాలు చేపడతామని మంత్రి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. అందుకోసం రూ.16వేల కోట్ల వరకు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే నల్లగొండ నియోజకవర్గం, నల్లగొండ మున్సిపాలిటీలో..

- మిగతా 7వ పేజీలో...

భువనగిరిపై 'చేయి'

యాదాద్రి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే భువనగిరి, యాదగిరిగుట్ట, ఆలేరు, చౌటుప్పల్ మునిసిపాలిటీల్లో అవిశ్వాసానికి తెరలేపింది. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు మునిసిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరగా, చౌటుప్పల్, యాదగిరిగుట్ట మునిసిపాలిటీల్లో అవిశ్వాసం లేకుండా పోయింది. భువనగిరి మునిసిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గి కాంగ్రెస్ ఖాతాలో చేరింది. ఆలేరు చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస మాత్రం వీగింది.

సీఎం మూసీ బాట

మూసీ ప్రక్షాళనకు పూనుకున్న ప్రభుత్వం అందులో భాగంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు, సంగెం శివన్న సంకల్పం తీసుకుని మూసీ పునరుజ్జీవం చేసి తీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు వలిగొండ మండలం సంగెం బ్రిడ్జి నుంచి మూసీ పునరుజ్జీవ పాదయాత్ర నిర్వహించి మూసీ ప్రక్షాళన ఆవశ్యకతను వివరించారు. వివిధ కులవృత్తులు, రైతులతో మమేకం అయ్యారు. మూసీ ఉప్పొంగినప్పుడు సంగెం-వలిగొండ, జూలూరు-పెద్దరావులపల్లి అండర్ బ్రిడ్జిలు మునుగుతుండటంతో ఇక్కడ బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. అదేవిధంగా మూసీ నది ఒడ్డున వెలసిన భీమలిగం శివన్నను దర్శించుకునేలా పనులు నిర్వహించేందుకు రూ.2కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

బంగారం తాపడం పనులు షురూ

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి విమాన గోపురానికి బంగారు తాపడం పనులు ప్రారంభమయ్యాయి. బంగారం తాపడం మొత్తం 10వేల చదరపు అడుగులు చేపట్టాల్సి ఉండగా, 60కిలోల బంగారం అవసరం. విరాళాల ద్వారా 10.500కిలోలు, రూ.20కోట్లతో 26కిలోలు, దేవస్థానానికి చెందిన 13కిలోల గోల్డ్‌బాండ్స్, దేవస్థానం వద్ద ఉన్న 2కిలోల బంగారం, 776కిలోల వెండి బంగారం తాపడం కోసం వినియోగించారు. అదేవిధంగా భక్తులు విరాళాల ద్వారా ఇచ్చిన నగదును వినియోగించేలా సెప్టెంబరు 27న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అంతేగాక పాత ఆచారాల పునరుద్ధరణ, గిరిప్రదక్షిణ వంటివాటిని ప్రారంభించింది. గుట్టపైకి ఆటోలను అనుమతించింది.

'ప్రజావాణి' అర్జీలను పరిష్కరించాలి

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), డిసెంబరు 2, (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించిన దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. అర్జీలను వెంటనే పరిశీలించి, వాటికి పరిష్కారం చూపాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది ఆగస్టు 30 నుంచి సెప్టెంబరు మొదటి వారం వరకు వచ్చిన తుఫాన్ కారణంగా వివిధ శాఖలకు సంబంధించిన ఆస్తులకు నష్టం వాటిల్లిందన్నారు. నష్టపరిహారం చెల్లించే నిమిత్తం విపత్తు నివారణ కమిటీ మంగళవారం జిల్లాకు రానున్నట్లు తెలిపారు. వివిధ శాఖలకు సంబంధించి ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, విద్యాశాఖకు చెందిన భవనాలు, వ్యవసాయ, ఉద్యానవన శాఖకు సంబంధించిన నష్ట వివరాలను శాఖలవారీగా నివేదికను సిద్ధంచేసి దానికి సంబంధించిన ఫొటోలను ఆల్బమ్ రూపంలో తయారుచేసి అందజేయాలన్నారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, సీపీవో కిషన్, జిల్లా సంక్షేమాధికారులు నర్సింహారావు, శంకర్, డీపీవో నారాయణరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ కోటాచలం, పశుసంవర్ధకశాఖాధికారి శ్రీనివాసరావు, డీఎఫ్‌వో సతీష్ పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనులు చేపట్టాలి



మోతె మండల కేంద్రంలో డబుల్‌రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

» కాంట్రాక్టర్లు నాణ్యతతో పనులు చేపట్టాలి
» కోదాడను రాష్ట్రంలో నెంబర్‌వన్‌గా నిలబెట్టడమే లక్ష్యం
» సంక్రాంతిలోపు రైతు భరోసా
» భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్

మోతె, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే లక్ష్యంగా పనులు చేపట్టాలని, కోదాడ నియోజకవర్గాన్ని రూ.100 కోట్లతో అభివృద్ధి చేసి, రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుతామని భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మోతె మండల కేంద్రం నుంచి విజయవాడ నేషనల్ హైవే ముద్దులచెర్వు వరకు రూ.25కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. కోదాడ పట్టణంలో వంద పడకల ఆస్పత్రితోపాటు సీటీ స్కాన్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేయలేని పనులను కాంగ్రెస్ హయాంలో ఏడాదిలోనే చేసి చూపామన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో వరి సాగైందన్నారు. ఆరు గ్యారెంటీల పథకాల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ వంటి కార్యక్రమాలతోపాటు సంక్రాంతి పండుగ లోపు ప్రతి రైతుకు రైతు భరోసాను అందిస్తామన్నారు. 50వేల మంది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. అంతకుముందు కార్యకర్తలు రెండు కిలోమీటర్ల మేర భారీ వాహనర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, లక్ష్మీనారాయణరెడ్డి, ఏసీపీ నాగేశ్వరరావు, ఆర్డీవో వేణుమాధవ్, ఆర్అండ్‌బీ ఈఈ సీతారామయ్య, తహసీల్దార్ సంఘమిత్ర, ఎంపీడీవో ఆంజనేయులు, మునగాల సీఐ మాజీ ఎంపీపీ ఆశ, పుల్లారావు, మాతృనాయక్, గుర్వారెడ్డి, సంతోష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాగునాయక్ పాల్గొన్నారు.

కోదాడటౌన్: నాణ్యతా ప్రమాణాలతో ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్, సబ్‌డివిజన్ల కార్యాలయాల నిర్మాణాలు చేపట్టాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని రామాలయం పక్కన ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్, ఆర్అండ్‌బీ సబ్‌డివిజన్ కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల పాల్గొన్నారు.

బిల్లుల కోసం చూడకుండా పనులు పూర్తి చేయాలి

అనంతగిరి: కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఎదురు చూడకుండా పనులు పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్ అన్నారు. ఎమ్మెల్యే పద్మావతితో కలిసి అనంతగిరి నుంచి చనుపల్లి వరకు సుమారు 10కిలోమీటర్ల మేర బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేనందున నిధుల మంజూరులో కొంత జాప్యం జరగవచ్చన్నారు. అంతకుముందు కొమరబండ వైజంక్షన్ నుంచి లారీ కార్యాలయం వరకు రూ.18కోట్లతో నిర్మించనున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పద్మావతితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు మాధవరెడ్డి, మాజీ సర్పంచ్ వేనేపల్లి వెంకటయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్ర సుధా, పుల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఈదుల కృష్ణయ్య, బుర్ర నర్సింహారెడ్డి, డేగ బాబు, రమేష్, గోపాల్‌రెడ్డి, ఆర్డీవో సూర్యనారాయణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యం

మునగాల రూరల్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని భారీ నీటి పారుదల శాఖ, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆకుపాముల గ్రామశివారులో జాతీయ రహదారివెంట స్థానిక సబ్‌స్టేషన్‌లో రూ.10కోట్లతో నూతనంగా ఏర్పాటు చేయనున్న నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రం భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. యువకులు నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి మాట్లాడుతూ ఏడాది కాలంలోనే నైపుణ్య అభివృద్ధి కేంద్రం భవన నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ రాష్ట్ర డైరెక్టర్ రాజిరెడ్డి, జిల్లా డైరెక్టర్ రమేష్, ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు, ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, కాసర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ విధులు చాలా ప్రత్యేకమైనవి

ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటక్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సమాజంలో పోలీస్ విధులు చాలా ప్రత్యేకమైనవని, ఇతర శాఖల విధులతో పోలిస్తే పోలీస్ డ్యూటీ క్లిష్టమైందని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. ఇటీవల నూతన కానిస్టేబుళ్లుగా ఎంపికై శిక్షణ పూర్తిచేసుకొని, జిల్లాకు వచ్చిన 281 మంది కానిస్టేబుళ్లకు సోమవారం జిల్లాకేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. విధులు నిర్వహించే సమయంలో సమాజం దృష్టి పోలీసులపై ఉంటుందన్నారు. క్రమశిక్షణతో బాధ్యతగా వ్యవహరించి, విధులు నిర్వహించాలన్నారు. ప్రజలతో మర్యాదగా మెలగాలని, ప్రజలకు సేవలందించడానికి పోలీస్ ఉద్యోగం మంచి మార్గమన్నారు. నేరస్తులపట్ల కఠినంగా వ్యవహరిస్తూనే సాధారణ ప్రజలతో స్నేహపూర్వక వాతావరణం కలిగి ఉండాలన్నారు. అనేక సమస్యలతో బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వస్తారని, అలాంటి వారికి ధైర్యం, భరోసా కల్పించాలన్నారు. బాగా పని చేసే వారికి సమాజంలో గుర్తింపు ఉంటుందని, రివార్డులు అందిస్తామన్నారు. అనంతరం నూతన కానిస్టేబుళ్లకు నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నర్సింహాచారి, ఎస్బీఐ వీరరాఘవులు, ఆర్ఐలు నారాయణరాజు, నర్సింహ, సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ గురుకుల రాజశేఖర్, ఆర్ఎస్ఐలు సురేష్, అశోక్, అన్వర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ భవనంపైకి ఎక్కి ఆత్మహత్యాయత్నం

» అడ్డుకుని కిందికి తీసుకువచ్చిన పోలీసులు » ఫ్లోర్ క్లీనింగ్ ద్రావణం తాగిన ఓ విద్యార్థిని
» కోదాడ నర్సింగ్ కళాశాల విద్యార్థినుల ఆందోళన » యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న స్నేహ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, చికిత్స పొందుతున్న స్నేహ

సూర్యాపేట(కలెక్టరేట్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తమను మానసికంగా ఇబ్బందులు పెడుతున్న కోదాడ స్నేహ నర్సింగ్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. సోమవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా కోదాడలోని స్నేహ నర్సింగ్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆ కళాశాల బీఎస్సీ నర్సింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 17మంది విద్యార్థినులు 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. కళాశాలలో సరైన వసతులు లేవని, సమస్యలపై ప్రశ్నిస్తే కళాశాల వార్డెన్లు తమపై దాడులకు పాల్పడడమే కాకుండా అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని వాపోయారు. కళాశాలలో కనీసం లైబ్రరీ, క్లినికల్ ల్యాబ్స్ లేవన్నారు. ఆహారం నాణ్యతగా ఉండడం లేదని,దీంతో రోగాల బారిన పడుతున్నామని తెలిపారు. ఇతర రాష్ట్రానికి చెందిన ఓ విద్యార్థినిని ఇబ్బందులకు గురిచేయడంతో ఇటీవల ఆత్మహత్యాయత్నం చేసిందన్నారు. ఫీజులు కూడా అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని తెలిపారు. కళాశాలలో నెలకొన్న సమస్యలపై యాజమాన్యానికి, వివిధ శాఖల అధికారులకు పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ రాంబాబు విచారణ చేయిస్తామని హామీ ఇచ్చారు. అయినా కలెక్టర్ వచ్చే వరకూ తాము వెళ్లేది లేదని కలెక్టరేట్ ఆవరణలోనే రాత్రి 7గంటల వరకు వేచి ఉన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటన ముగించుకుని వచ్చిన జిల్లా కలెక్టర్ విద్యార్థినులతో మాట్లాడారు. కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని, కళాశాలకు తిరిగి వెళ్లాలని సూచించారు. అయినా తమకు న్యాయం జరగలేదని కొందరు విద్యార్థినులు కలెక్టరేట్ భవనంపైకి ఎక్కి దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించారు. గమనించిన పోలీసులు వెంటనే వారిని భవనం పైనుంచి కిందికి తీసుకొచ్చారు. తర్వాత ఓ విద్యార్థిని మూత్రశాలకు వెళ్లి అక్కడ ఉన్న ఫ్లోర్ క్లీనింగ్ చేసే ద్రావణాన్ని తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన తోటి విద్యార్థినులు పోలీసులకు తెలపడంతో వెంటనే 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

ఇథనాల్ కంపెనీని ఎత్తివేయాలి

న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్



ఇథనాల్ కంపెనీని ఎత్తివేయాలని ధర్నా చేస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు, కార్యకర్తలు


మోతె, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రమాదకరంగా మారిన ఇథనాల్ కంపెనీని వెంటనే ఎత్తివేయాలని న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా మోతె మండలపరిధిలోని రావిపహాడ్‌లో నిర్మిస్తున్న ఇథనాల్ కంపెనీ ఎదుట న్యూడెమోక్రసీ నాయకులు, గ్రామస్థులతో కలిసి ధర్నా నిర్వహించి మాట్లాడారు. ప్రజల నుంచి ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండా తమ ఇష్టానుసారంగా నిర్మిస్తున్న కంపెనీని ఎత్తివేయాలన్నారు. కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ కేంద్ర ప్రభుత్వం పేదల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. ఆహార ధాన్యాల ద్వారా ఇథనాల్ ఉత్పత్తి చేసే విధానాన్ని మానుకోవాలని, భవిష్యత్‌లో ఆహార కొరత ఏర్పడుతుందన్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి, తమ సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గంటా నాగయ్య, కునుకుంట్ల సైదులు, బొడ్డు శంకర్, పోలెబోయిన కిరణ్, అలుగుబెల్లి వెంకట్‌రెడ్డి, ఎర్ర మహేష్, కంచర్ల నరసమ్మ, పొడపంగి ముత్తయ్యపాల్గొన్నారు.

యాసంగికి ఢోకాలేనట్టే!

» కళకళలాడుతున్న మూసీ
» జూన్ నుంచి గరిష్ఠస్థాయిలోనే నీటిమట్టం
» హర్షం వ్యక్తం చేస్తున్నరైతులు

7



అంధులకు దృష్టి నిర్దేశం

అంధులు మరొకరి తోడు లేకుండా ముందుకు సాగే పరిస్థితులు ఉండవు. వారు ప్రతిరోజూ అనేక సవాళ్లు ఎదుర్కొంటారు. అయితే వారికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అనేకవిధాల దోహదపడుతోంది. అంధుల నిత్యఅవసరాల్లో ఈ టెక్నాలజీ ఎంతగానో ఉపయోగపడుతోంది. ఏఐ టెక్నాలజీతో తయారు చేసిన ద్రిష్టి ఏఐ ఎనేబుల్డ్ విజన్ కళ్లాద్దాలు అంధులకు ఆశాదీపంగా మారాయి. పేపరు చదవడంతో పాటు ఎదురుగా ఉండే వస్తువుల గురించి వివరిస్తుంది. అమెరికాలో తయారైన ఈ కళ్లాద్దాలను ఇటీవల కిమ్స్ ఫౌండేషన్ కొనుగోలు చేసింది. ఇటీవల గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా ఈ కళ్లాద్దాలను అంధులకు పంపిణీ చేసింది.

అంధులకు మార్గనిర్దేశం చేస్తున్న స్మార్ట్ కళ్లాద్దాలపై ప్రత్యేక కథనం

(ఆంధ్రజ్యోతి -నల్లగొండ)

● ఏఐ టెక్నాలజీతో రూపకల్పన ● పుస్తకాలు, పత్రికలను స్కాన్ చేసేలా తయారీ

అంధుల ఇబ్బందులను ఏఐ టెక్నాలజీతో అధిగమించేందుకు అనేక ఆవిష్కరణలు వస్తున్నాయి. ద్రిష్టి ఏఐ ఎనేబుల్డ్ విజన్‌గా పిలవబడే ఈ కళ్లాద్దాలను ఇటీవల హైదరాబాదులో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ స్మార్ట్ కళ్లాద్దాలు దృష్టిలోపం ఉన్నవారికి నిత్యంమార్గనిర్దేశం చేస్తుంటాయి. ఇందులోని ఏఐ టెక్నాలజీ అంధులకు వస్తువులను, మనుషులను గుర్తించడంలో ఉపయోగపడుతుంది. రీడింగ్ అసిస్టెంట్, ఇండోర్ నావిగేషన్‌తో నడిచే ఈ స్మార్ట్‌గ్లాసెస్ అంధులకు ఎంతో ఉపయుక్తంగా మారింది.

స్మార్ట్‌గ్లాసెస్‌లో ఫీచర్స్...

ఏఐ ఆధారిత గ్లాసెస్‌ను మొబైల్ అప్లికేషన్‌తో అనుసంధానించుకోవాలి. చుట్టూ ఉన్న పర్యావరణాన్ని తెలుసుకునేందుకు ఈ స్మార్ట్ కళ్లాద్దాలకు అనుసంధానంగా కెమెరాను ఏర్పాటు చేశారు. ఇందులో చిన్నపాటి స్పీకర్ ఉంటుంది. ఇది పరిసరాలను అంధులకు స్పీకర్‌లో వినిపిస్తుంటుంది. బ్లూటూత్ వైఫై సెన్సార్ల ద్వారా వెళ్లే మార్గాన్ని, నావిగేషన్‌ను అందిస్తుంది. ఈ అద్దాలు ధరించిన వ్యక్తి ఎదుటగా ఉన్న వ్యక్తులను పరిసరాలను స్కానింగ్ చేసి ఆడియో ద్వారా వినిపిస్తుంది. అరగంట సేపు చార్జింగ్ చేస్తే నాలుగు గంటల పాటు ఈ కళ్లాద్దాల సేవలను వినియోగించుకోవచ్చు.

అధ్యయనంలో దినేష్‌రెడ్డి

ద్రిష్టి ఏఐ ఎనేబుల్డ్ విజన్ అద్దాలను ఇటీవల గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ డ్యాబ్ ప్రధాన కార్యదర్శి పొనుగోటి చొక్కారావుకు అందజేశారు. ఆ కళ్లాద్దాలను అధ్యయనంతో పాటు సద్వినియోగం చేసుకునేందుకు ఆయన నల్లగొండ పట్టణంలోని బ్యాంకు ఉద్యోగి, అంధుడైన దినేష్‌రెడ్డికి అందించారు. ఆయన రెండు రోజులపాటు ఆ గ్లాసుల పనితీరును అధ్యయనం చేశారు. ఈ స్మార్ట్ కళ్లాద్దాల ధరలు అధికంగా ఉండటంతో పేద, మధ్య తరగతి అంధులు కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థల ముందుకు వచ్చి అందిస్తే అంధులకు ఇది ఉపయోగపడుతుంది. చదువుతో పాటు ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అంధ యువతీ, యువకులకు ఈ కళ్లాద్దాలు ఎంతగానో ఉపయోగపడతాయి. వీటిని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అంధులు పేర్కొంటున్నారు. ప్రభుత్వానికి తోడు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాల్సిన అవసరం ఉందని అంధులు కోరుతున్నారు.



ద్రిష్టి ఏఐ ఎనేబుల్డ్ విజన్ కళ్లాద్దాలతో 'ఆంధ్రజ్యోతి' పత్రికను చదువుతున్న దినేష్‌రెడ్డి

అంధుల, దివ్యాంగుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలి



రాష్ట్రంలోని అంధుల, దివ్యాంగుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలి. ద్రిష్టి స్మార్ట్ కళ్లాద్దాలు అంధులకు ఎంతగానో ఉపయోగపడతాయి. ప్రతీ ఒక్క అంధుడికి ఈ కళ్లాద్దాలను అందించాలి. అదేవిధంగా దివ్యాంగుల సంక్షేమం కోసం స్వయం ప్రతిపత్తితో కూడిన కమిషనర్‌ను నియమించాలి. ప్రత్యేక కమిషనర్ కోసం ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించాం. ప్రభుత్వం తక్షణమే స్పందించాలి.

పొనుగోటి చొక్కారావు, డ్యాబ్ ప్రధానకార్యదర్శి

స్మార్ట్ గ్లాసెస్‌తో అంధులకు ప్రయోజనం



ద్రిష్టి స్మార్ట్ కళ్లాద్దాలతో అంధులకు ఎంతో ఉపయోగం. అయితే దీని ధర రూ.15 వేలు ఉంది. ఇంత ధర పెట్టి పేద కుటుంబాలకు చెందిన అంధులు కొనుగోలు చేయలేరు. ప్రభుత్వం పంపిణీ చేసి ఆదుకోవాలి. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు నల్లగొండలో డ్యాబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాలలో చదువుకున్నా. ఈ కళ్లాద్దాలను డ్యాబ్ ప్రధాన కార్యదర్శి చొక్కారావు అందించారు. ఇది ఎంతగానో నాకు ఉపయోగపడుతుంది. ఈ స్మార్ట్‌గ్లాస్‌లు అందించినందుకు ఆయనకు ధన్యవాదాలు.

దినేష్‌రెడ్డి, బ్యాంకు ఉద్యోగి, నల్లగొండ.

నల్లగొండ జిల్లా కళాకారులకు

జాతీయ అవార్డులు

● చింతల యాదగిరికి సాహిత్యరత్న అవార్డు ● ఆర్టిస్ట్ నివాస్‌కు కళారత్న అవార్డు ● అవార్డులు ప్రకటించిన బహుజన సాహిత్య అకాడమీ



నివాస్‌కు అవార్డులకు ఎంపికైనట్లు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న నిర్వాహకులు

నల్లగొండ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లాకు చెందిన కవి, గాయకుడు, ప్రజావాగ్గేయకారుడు చింతల యాదగిరిని జాతీయ అవార్డు వరించింది. బహుజన సాహిత్య అకాడమీ ఈ అవార్డులను ప్రదానం చేస్తోంది. యాదగిరి సాహిత్య రంగంలో చేసిన కృషికిగాను జాతీయ సాహిత్య రత్న అవార్డును ఈ నెల 15వ తేదీన న్యూఢిల్లీలో జరగనున్న కార్యక్రమంలో అందించనున్నారు. ఈ మేరకు అకాడమీ తరపున ఆయనకు ధ్రువీకరణపత్రాన్ని హైదరాబాదులో అందజేశారు. 33 ఏళ్ల కిందట బాల కార్మిక వ్యవస్థపై చింతల యాదగిరి రాసి పాడిన 'నా చిట్టి చేతులు చక్కని రాతలు నేర్వలేదయ్యో..' అన్న పాట లక్షలాది మంది బాల కార్మికులను బడిబాట పట్టించింది. గడిచిన మూడు దశాబ్దాలుగా యాదగిరి తన పాటలతో సాహిత్య రంగానికి చేసిన సేవలకు గాను ఈ జాతీయ అవార్డు దక్కింది.

● నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన ఆర్టిస్టు కొండేటి శీనయ్య అలియాస్ నివాస్ అనే యువకుడికి కూడా జాతీయ కళారత్న అవార్డు ప్రదానం చేయనున్నారు. నివాస్ గ్రానైట్ ఫలకలపై చిత్రాలు చెక్కడంలో ప్రసిద్ధుడు. దేశవ్యాప్తంగా ఈ కళారంగానికి నివాస్ అందిస్తున్న సేవలకు ఆయనకు జాతీయ కళారత్న అవార్డు ఇస్తున్నట్లు బహుజన సాహిత్య అకాడమీ ప్రకటించి, ధ్రువీకరణ పత్రాన్ని అందించింది. జిల్లాకు చెందిన ఇరువురికి జాతీయస్థాయి అవార్డులు రావడంతో వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



అంజిరెడ్డి(ఫైల్)

హుజూర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం వేపలసింగారానికి చెందిన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ కమిటీ మాజీ అధ్యక్షుడు సారెడ్డి అంజిరెడ్డి(70) వారం కిందట చిలుకూరు మండలకేంద్రంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన్ను చికిత్స నిమిత్తం ఖమ్మంకు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పదేళ్ల పాటు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. బీఆర్ఎస్ నాయకుడిగా పార్టీ ఉద్యమాల్లో క్రియాశీలంగా పనిచేశారు. అంజిరెడ్డి మృతికి పీఏసీఎస్ చైర్మన్ ఊరె రాధాకృష్ణ, మాజీ సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి, సారెడ్డి భాస్కర్‌రెడ్డి, సైదిరెడ్డి, కోటిరెడ్డి, రెక్కల శంభిరెడ్డి తదితరులు నివాళులు అర్పించారు.

వేర్వేరు చోట్ల ఆటోల పల్టీ : ఏడుగురికి తీవ్రగాయాలు

మఠంపల్లి, బక్కమంతులగూడెంలలో ఘటన



లారీకిందకు దూసుకెళ్లిన ఆటో



గాయపడిన రాముడు, శిరీష

మఠంపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో రెండు చోట్ల ఆటోలు పల్టీ కొట్టాయి. ఆయా ఘటనల్లో ఏడుగురు తీవ్రంగా గాయపడగా, మరో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. మఠంపల్లి నుంచి హుజూర్‌నగర్‌కు వెళ్తున్న ఆటోను బక్కమంతులగూడెం గ్రామసమీపంలో వెనుక నుంచి సిమెంట్ లారీ ఢీకొనడంతో వేగంగా ముందుకు కదలిన ఆటో ముందు వెళ్తున్న లారీ కింద చిక్కుకుంది. ఈ ప్రమాదంలో లాలితండాకు చెందిన ఆటో డ్రైవర్ బానోతు రాముడు, మంచ్యా తండాకు చెందిన బానోతు శిరీషలకు తీవ్ర గాయలయ్యాయి. వీరిని స్థానికులు 108 వాహనంలో హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం రకోసం బంధువులు ఖమ్మం తరలించినట్లు తెలిపారు.

● ఎనిమిది మంది ప్రయాణికులతో మఠంపల్లి నుంచి హుజూర్‌నగర్ వైపు వెళ్తున్న మరో ఆటో మండలకేంద్ర సమీపంలోని హెచ్‌పీ బంక్ వద్ద కుక్కను తప్పించబోయి పల్టీ కొట్టింది. ప్రయాదంలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన వీ నాగమ్మ, సరస్వతీ, విజయవాడకు చెందిన వేణుగోపాల్, మఠంపల్లికి చెందిన సరోజినమ్మ, జమ్లాతండాకు చెందిన శీలకు తీవ్రగాయాలు కాగా మరో ముగ్గురు ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు మరో ఆటోలో హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మండలంలో ఒకేరోజు రెండు చోట్ల ఆటోలు పల్టీ కొట్టడంతో చర్చనీయాంశమైంది. పరిమితికి మంచి ప్రయాణికులను తరలిస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఆయా ఘటనలపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి, కేసు నమోదు

నల్లగొండ క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : విధుల్లో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన ఘటనలో ఓ వ్యక్తిపై నల్లగొండ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే డీలక్స్ బస్సు నడుపుతున్న డ్రైవర్ చెరుకు వెంకన్న నల్లగొండ బస్టాండ్ నుంచి ప్రయాణికులను తీసుకుని హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో వెనకాల కారులో వస్తున్న పట్టణంలోని దేవరకొండ రోడ్డుకు చెందిన చిట్టిమళ్ల ఆంజనేయులు సైడ్ ఇవ్వలేదనే కారణంతో డ్రైవర్ వెంకన్నపై దాడి చేశాడు. విధులకు ఆటంకం కలిగించడంతో పాటు తనపై దాడి చేశాడని నల్లగొండ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో వెంకన్న ఫిర్యాదు చేయడంతో ఆంజనేయులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ రావుల నాగరాజు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



గీతారెడ్డి(ఫైల్)

నాగారం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గేదెల పాలు పితకడానికి వెళ్లి విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నాగారం మండలం ప్రగతినగర్‌లో జరిగింది. ఎస్ఐ ఐలయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రగతినగర్‌కు చెందిన గంట గీతారెడ్డి(49) ఆదివారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో పశువుల కొట్టంలోని పాడి గేదెల పాలు పితకడానికి వెళ్లింది. అక్కడ పాత్రను కుళాయి వద్ద కడిగే సమయంలో ఇనుప స్తంభాన్ని పట్టుకుంది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పిల్లలు హైదరాబాద్‌లో చదువుకుంటున్నారు. వారిని చూడడానికి భర్త రామనుజరెడ్డి రెండు రోజుల కిందట అక్కడికి వెళ్లారు. సోమవారం పాలు తీసుకువెళ్లడానికి వచ్చిన స్థానిక మహిళ విగత జీవిగా ఉన్న గీతారెడ్డిని చూసి గ్రామస్థులకు తెలపడంతో విషయం వెలుగుచూసింది. ఘటనా స్థలాన్ని సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ ఐలయ్య పరిశీలించారు. తుంగతుర్తి ఏరియా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. కేసు నమెదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. గీతారెడ్డి మృతదేహాన్ని ఎమ్మెల్యే మందుల సామేలు సందర్శించి నివాళులర్పించారు.

శాంతినగర్ హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

అనంతగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం శాంతినగర్ సమీకృత హాస్టల్ వార్డెన్ పద్మావతిని సస్పెండ్ చేస్తూ ఆ జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి లత సోమవారం విలేకరులకు తెలిపారు. ఆదివారం హాస్టల్‌లో 10వ తరగతి చదువుతున్న గుగులోతు తిరుమలేశ్‌ని ట్యూషన్ ట్యూటర్ వీరబాబు హాస్టల్ నుంచి బయటికి తీసుకెళ్లి చెట్లు కొట్టించడంతో పాటు బావిలోకి దూకమని ప్రోత్సహించి అతడి మరణానికి కారణమయ్యాడు. వార్డెన్ నిర్లక్ష్యం వల్లే విద్యార్థి హాస్టల్ నుంచి బయటికి వెళ్లాడని, ఇందుకు వార్డెన్‌ను బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



జూడో పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ పాపిరెడ్డి

భువనగిరి టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలోనూ రాణించాలని ఇంటర్ నోడల్ అధికారి రమణి అన్నారు. సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలో నిర్వహించిన అండర్-19 జిల్లా స్థాయి బాల, బాలికల జూడో పోటీల సందర్భంగా ఆమె మాట్లాడారు. క్రీడలతో విద్యార్థుల్లో పట్టుదల, క్రమశిక్షణ అబ్బుతాయని, అదే తరహా శ్రద్ధను చదువులోనూ చూపితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. పోటీలను బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పాపిరెడ్డి ప్రారంభించి, విజేతలకు బహుమతులు అందజేశారు. విజేతలు త్వరలో వరంగల్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా నుంచి పాల్గొంటారని ఆయన తెలిపారు. నిర్వహణ కార్యదర్శి డాక్టర్ ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు : బాలికల 35 కిలోల విభాగంలో మధులత, 45 కిలోల విభాగంలో పావని, 52 కిలోల విభాగంలో శ్రీనిధి, 63 కిలోల బాగంలో అంజలి, 65 కిలోల బాగంలో రుచిత విజేతలుగా నిలిచారు. బాలుర 55 కిలోల విభాగంలో ఈశ్వర్, 60 కిలోల విభాగంలో శ్రీరామ్, 66 కిలోల బాగంలో శివశంకర్, 73 కిలోల విభాగంలో విజ్ఞాన్ విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు.

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు, రిమాండ్



స్వాధీనం చేసుకున్న వాహనాలను చూపిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పలు దొంగతనాల కేసుల్లో ఉన్న నేరస్తుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి తెలిపారు. కేసు వివరాలను ఆయన సోమవారం వన్‌టౌన్ పీఎస్‌లో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అక్టోబరు 24న మునుగోడు రోడ్డులోని మంచికంటి లక్ష్మమ్మ ఇంటిలోని సాయిబాబా గుడిలో చోరీ జరిగింది. తులం వెండి చైన్, రెండు తులాల వెండి లాకెట్, గుడిలో ఉన్న హుండీ పగలగొట్టి అందులో ఉన్న రూ.4వేల నగదు చోరీకి గురికాగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కేసు పరిశోధనలో భాగంగా ఈ నెల 1న సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి నెంబర్ ప్లేట్‌లేని బైక్‌పై వెళ్తుండగా ప్రశ్నించారు. అనుమానాస్పదంగా సమాధానం చెప్ప డంతో అదుపులోకి తీసుకుని, విచారించగా నల్లగొండలోని మాధవనగర్‌కు చెందిన పొలిశెట్టి కార్తీక్‌గా చెప్పడంతో పాటు పలునేరాలు చేసినట్లు అంగీకరించాడు. డ్యూక్ బైక్‌ను పంజాగుట్ట పీఎస్ పరిధిలో చోరీ చేశానని, మునుగోడు రోడ్డులో సాయిబాబా ఆలయంలో చోరీ చేసిన విషయం కూడా అంగీకరించాడన్నారు. పాత నేరస్తుడైన కార్తీక్ నల్లగొండ వన్‌టౌన్, టూటౌన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు, హైదరాబాద్‌లోని జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆరు దొంగతనాలు చేసి అరెస్టు అయి జైలుకు కూడా వెళ్లి వచ్చినట్లు ఒప్పుకున్నాడని డీఎస్పీ తెలిపారు. బెయిల్‌పై బయటికి వచ్చిన తర్వాత జైల్‌లో పరిచయమైన ధనావత్ తిరుపతితో కలిసి పంజాగుట్ట పీఎస్ పరిధిలో మోటార్ సైకిల్ దొంగతనం, ఖమ్మం రూరల్ పీఎస్ పరిధిలో ఓ ఇంట్లో చోరీ, ఖమ్మం త్రీటౌన్ పీఎస్ పరిధిలో ఆటో చోరీ, నార్కట్‌పల్లి పీఎస్ పరిధిలో ఇంట్లో చోరీ, హాలియా పీఎస్ పరిధిలో ఓ ఇంట్లో దొంగతనంతో పాటు మొత్తం ఎనిమిది నేరాలు చేసినట్లు తెలిపాడన్నారు. కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ రాజశేఖర్‌రెడ్డి, సీసీఎస్ సీఐ జితేందర్ రెడ్డి, ఎస్ఐ ఉప్పు సురేష్, సిబ్బంది విష్ణువర్ధన్‌గిరి, దుర్గయ్య, సైదులును డీఎస్పీ అభినందించారు.

సీతకష్టాలు పాఠ్యాంశంపై విద్యార్థులతో బుర్రకథ

● మద్దిరాల మండలం గోరెంట్ల పాఠశాలలో విద్యార్థులతో ప్రయోగం



బుర్రకథ ద్వారా పాఠ్యాంశాన్ని వివరిస్తున్న విద్యార్థులు

మద్దిరాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అటు ప్రాచీన కళలను ప్రోత్సహిస్తూనే, ఇటు పాఠాలను గుర్తుంచుకునేలా వినూత్నంగా ప్రయత్నించారు సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరెంట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు. 7వ తరగతి తెలుగు వాచకంలోని సీత కష్టాలు పాఠ్యాంశాన్ని తెలుగు ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ విద్యార్థులతో సోమవారం బుర్రకథ రూపంలో ప్రదర్శించారు. విద్యార్థులు సాయికృష్ణ, గాయత్రి, రాజేష్‌లు సీత కష్టాలు పాఠ్యాంశాన్ని బుర్రకథ రూపంలో చక్కగా వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు టిక్కి రమేష్‌గౌడ్ మాట్లాడుతూ కనుమరుగవుతున్న ప్రాచీన కళలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ ప్రయత్నం ద్వారా విద్యార్థులలో దాగి ఉన్న కళాత్మకతను వెలికి తీయవచ్చన్నారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడిని, విద్యార్థులను ఉపాధ్యాయులు కృష్ణవేణి, శ్రీను, సీఆర్పీలు నవీన్, ఉపేందర్, రమేష్, శిరీష, మురళీధరన్, మల్లికార్జున్, అభినవ్, శ్రీలత తదితరులు అభినందించారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



శాలిగౌరారం ప్రాజెక్టు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

శాలిగౌరారం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : శాలిగౌరారం ప్రాజెక్టు నీటిని పొదుపుగా వాడుకోవాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. యాసంగి సీజన్‌కు గాను సోమవారం నల్లగొండ జిల్లా శాలిగౌరారం ప్రాజెక్టు నీటిని కుడి, ఎడమ ప్రధాన కాల్వలకు ఎమ్మెల్యే విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పనిచేస్తోందన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు.

కస్తూర్బా బాలికల పాఠశాల తనిఖీ

శాలిగౌరారంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే సామేల్ తనిఖీ చేశారు. హాస్టల్ గదులను, తరగతి గదులను, వంట గదులను ఆయన పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. బాలికలకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఆయన వెంట ఐబీ డీఈ సత్యనారాయణ, తహసీల్దార్ యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కందాల సమరంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, చామల వెంకటరమణారెడ్డి, ఐబీ ఏఈ రాములు, నోముల జనార్దన్, చామల జైపాల్‌రెడ్డి, జోగు శ్రీనివాసులు, పడాల రమేష్, ఫుల్లారి దేవేందర్, మంగదుడ్ల శ్రీనివాస్, పడాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఏం చేశారని సంబురాలు

డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

ఆలేరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు ఏంచేశారని ప్రజాపాలన సంబురాలు జరుపుకుంటోందని డీసీసీబీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గొంగిడి మహేందర్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీలను అమలుపరచకుండా విజయోత్సవాలు జరుపుకోవడం హాస్యాస్పదమన్నారు. హామీలను అమలుచేయకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు కర్రె వెంకటయ్య, పుట్ట మల్లేశం, గడ్డమీది రవీందర్‌గౌడ్, వస్పరి శంకరయ్య, వెంకటేష్, మహేందర్‌రెడ్డి, గ్యాదపాక నాగరాజు, పంతం కృష్ణ, పత్తి వెంకటేశ్, మాడిశెట్టి మహేందర్, రాజునాయర్, అశోక్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమైందని

ఆత్మహత్య

సూర్యాపేటక్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ విఫలం కావడంతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన అనిల్(23) ఐదు రోజుల కిందట సూర్యాపేటకు వచ్చాడు. తన రాష్ట్రానికి చెందిన ఇప్పటికే సూర్యాపేటలోని సువెన్ ఫార్మాసుటికల్ కంపెనీలో పనిచేస్తున్న మిత్రుడి ద్వారా రోజువారీ కూలీగా కంపెనీలో పనికివెళ్తున్నాడు. అయితే బీహార్‌లోని వారి ప్రాంతానికి చెందిన యువతితో అనిల్‌కు ప్రేమ వ్యవహారం ఉంది.కాగా వారిద్దరి మధ్య ప్రేమవిఫలం కావడంతో మనస్తాపం చెంది సూర్యాపేటలోని హనుమాన్‌నగర్‌లో నివాసముంటున్న అద్దె ఇంట్లో ఉరేసుకున్నాడు. అయితే ఆత్మహత్యకు ముందు అనిల్ సెల్‌ఫోన్‌లో తనతో ప్రేమ వ్యవహారం నడిపిన యువతికి మెసేజ్‌చేశాడు. తాను చనిపోతున్నానని తన శవాన్ని చూడడానికైనా వస్తావు కదూ అంటూ ఒక మెసేజ్ చేశాడు. అంతేకాకుండా చనిపోయే ముందు తన మిత్రుడైన సూర్యాపేటలో ఉండే అతడి ఫోన్‌కు కూడా తాను చనిపోతున్నానని మెసేజ్ చేశాడు. కంపెనీలో ఫోన్‌ను లోపలికి అనుమతించకపోవడంతో ఆలస్యంగా ఫోన్‌ను చూసిన మిత్రుడు అనిల్ పంపిన మెసేజ్‌ను చూసి ఇంటికి వచ్చి చూసేసరికి చనిపోయాడు. ఈ విషయమై పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పట్టణ ఎస్ఐ వెంకటరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన శాలిగౌరారం పోలీసులు



పోలీస్‌స్టేషన్‌లో భర్తను హత్తుకుని ఏడుస్తున్న ఉపేంద్రాచారి భార్య

శాలిగౌరారం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో గొడవపడి ఆత్మహత్య చేసుకుంటానని బయటకు వెళ్లిన వ్యక్తిని నల్లగొండ జిల్లా శాలిగౌరారం పోలీసులు కాపాడారు. ఈ సంఘటన అంబారిపేట గ్రామంలో సోమవారం జరిగింది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన శివకోటి ఉపేందర్ కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను ఇంట్లో గొడవపడి వెళ్లి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి వెళ్లిపోయాడు. భయాందోళనకు గురైన భార్య డయల్-100కు కాల్ చేసింది. వెంటనే స్పందించి పోలీసులు ఉపేంద్రాచారి ఫోన్ లొకేషన్ ఆధారంగా గుర్తించారు. అతడు శాలిగౌరారంలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు జానయ్య, రవినాయక్, దేవేందర్, వెంకటయ్యలు అతడిని పట్టుకుని కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ డీ సైదులు విలేకర్లకు తెలిపారు. ఉపేంద్రాచారి కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ ఆర్ఎంగా జాన్‌రెడ్డి


జాన్‌రెడ్డి

నల్లగొండటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఆర్ఎంగా నూతనంగా నియమితులైన కె. జాన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నిజామాబాద్ జిల్లా ఆర్టీసీ ఆర్ఎంగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. కాగా ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన రాజశేఖర్ పదోన్నతిపై హైదరాబాద్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన ఆర్ఎంకు అధికారులు, యూనియన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

డీవైఎస్‌వోగా నర్సిరెడ్డి


నర్సిరెడ్డి

నల్లగొండ స్పోర్ట్స్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారిగా కుంభం నర్సిరెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కనగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న నర్సిరెడ్డికి డీవైఎస్‌వోగా అదనపు బాధ్యతలు ఇస్తూ కలెక్టర్ త్రిపాఠి ఉత్తర్వులు జారీచేశారు. సోమవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు.

యాసంగికి ఢోకాలేనట్టే!


నీటితో నిండుగా ఉన్న మూసీ రిజర్వాయర్

- కళకళలాడుతున్న మూసీ
- జూన్ నుంచి గరిష్ఠస్థాయిలోనే నీటిమట్టం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

కేతేపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మూసీ రిజర్వాయర్ ఈ ఏడాది సైతం నీటితో కళకళలాడుతోంది. నాలుగేళ్లుగా ఆయకట్టులో రెండు పంటల సాగుకు నీటిని అందిస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండో భారీ నీటిపారుదల ప్రాజెక్టుగా ఉన్న మూసీ రిజర్వాయర్ ఈ ఏడాది కూడా జలకళను సంతరించుకుంది. హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వచ్చే నీటితో ఈ ప్రాజెక్టు గత వేసవిలోనే జలకళను సంతరించుకుంది. ఆ తర్వాత వానాకాల సీజన్‌లో కురిసిన వర్షాలకు తోడు హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల నుంచి వచ్చే వృథా నీటితో ఈ ప్రాజెక్టుకు నిరంతరాయంగా ఇన్‌ఫ్లో కొనసాగుతూ వస్తుంది. దీంతో 645 అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం గత జూన్ నుంచి గరిష్ఠ స్థాయిలోనే కొనసాగుతుంది. ఈ క్రమంలో ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టులోని 30వేల పైచిలుకు ఎకరాల్లో వానాకాలం పంటల సాగుకు అధికారులు నీటిని విడుదల చేశారు. అయినా ఎగువ నుంచి వచ్చే నిరంతర ఇన్‌ఫ్లో కారణంగా ప్రాజెక్టు నీటిమట్టం ఏమాత్రం తగ్గుముఖం పట్టలేదు. ఈ క్రమంలో ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా నకిరేకల్, సూర్యాపేట, మిర్యాలగూడెం, నల్లగొండ నియోజకవర్గాల పరిధిలోని ఆయకట్టు భూములకు యాసంగి సాగునీరు అందించేందుకు ప్రాజెక్టు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

రెండు పంటలకు నీరందడం ఆనందంగా ఉంది



మూసీ ప్రాజెక్టు ద్వారా నాలుగేళ్లుగా రెండు పంటలకు సాగునీటిని అందుతుంది. ఈ ఏడాది వానాకాలం పంట కోతలు పూర్తయ్యాయి. యాసంగికి సైతం నీటిని అందించేందుకు వీలుగా ప్రాజెక్టు నిండుగా ఉండటంతో ఆనందంగా ఉంది.

- ఎం.నర్సయ్య,చీకటిగూడెం

ఆయకట్టుకు సరిపడా నీరు



ఈ ఏడాది యాసంగి సీజన్‌లో ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టు రైతులు పంటలు సాగు చేసుకోవడానికి సాగునీటిని విడుదల చేస్తాం. ప్రాజెక్టులో సమృద్ధిగా నీటి నిల్వలు ఉండడంతో నీటి విడుదలలో ఎలాంటి ఇబ్బందులు లేవు. హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో జరిగే సమావేశంలో చర్చించి వారి సూచనల మేరకు నీటి విడుదల షెడ్యూలును ఖరారు చేస్తాం. ఆ మేరకు ఆయకట్టుకు విడతల వారీగా సాగునీటిని వదులుతాం.

- ఎం.చంద్రశేఖర్, డీఈ, మూసీ ప్రాజెక్టు

30 వేల ఎకరాలకు అందనున్న సాగునీరు

జిల్లాలో 42 కిలోమీటర్ల పొడవు ప్రవహించే మూసీ ఎడమ కాల్వ సూర్యాపేట, చివ్వెంల, పెన్‌పహాడ్ మండలాల్లోని 15,230 ఎకరాలకు సాగునీటిని అందిస్తుంది. ఈ కాల్వ ద్వారా సూర్యాపేట నియోజకవర్గంలోని చివ్వెంల మండలంలో రెండు గ్రామాలు, పెన్‌పహాడ్ మండలంలో మూడు గ్రామాలు, సూర్యాపేట మండలంలో 16 గ్రామాలకు సాగునీటి సరఫరా జరుగుతుంది. 34 కిలోమీటర్ల పొడవున ప్రవహించే మూసీ కుడి కాల్వ కేతేపల్లి, వేములపల్లి, మాడ్గులపల్లి, తిప్పర్తి మండలాల్లోని 14,770 ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. ఈ కాల్వ పరిధిలో నకిరేకల్ నియోజకవర్గంలోని కేతేపల్లి మండలంలో 9 గ్రామాలు, మిర్యాలగూడ నియోజకవర్గంలోని వేములపల్లి మండలంలో 7 గ్రామాలు, నల్లగొండ నియోజకవర్గంలోని తిప్పర్తి, మాడ్గులపల్లి మండలాలకు చెందిన రెండేసి గ్రామాలకు సాగునీరు అందుతుంది. ప్రతి ఏటా డిసెంబరు మూడో వారంలో ఈ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు యాసంగి సాగునీటిని విడుదల చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఈ ఏడాది కూడా మూసీ ప్రాజెక్టు ఆయకట్టులో రెండో పంట సాగుకు నీరు అందనుండటంతో ఆయకట్టు రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తుంది.

బ్యాడ్మింటన్ రాష్ట్ర జట్టు కోచ్‌గా రామకృష్ణ

- అభినందించిన క్రీడాకారులు


రామకృష్ణ

మిర్యాలగూడ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బ్యాడ్మింటన్ రాష్ట్ర జట్టు కోచ్‌గా పట్టణానికి చెందిన మారబోయిన రామకృష్ణ నియమితులయ్యారు. యోనెక్స్ సన్‌రైజ్ మినీ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ (అండ ర్-11) రాష్ట్ర జట్టుకు కోచ్‌గా నియమితులయ్యారు. ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు మహారాష్ట్రలోని తానేలో పోటీలు జరగనున్నా యి. డీఎస్ఏ జిల్లా కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రామకృష్ణ గతంలో అండర్-13 రాష్ట్ర జట్టుకు కోచ్‌గా వ్యవహరించి పలు విజయాలు సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం ఎంటీఏ స్టేడియంలో మాట్లాడుతూ రాష్ట్రానికి గుర్తింపు తెచ్చేలా క్రీడాకారులకు శిక్షణ ఇస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పుల్లెంల గోపీచంద్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపాడు. రామకృష్ణ నియామకంపై జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, ఎంటీఏ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

రైతులకు 'ఫెంగల్' భయం


ధాన్యం రాశులపై పట్టాలు కప్పిన రైతులు

అర్వపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఫెంగల్ తుపాను ప్రభావంతో ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. రెండు రోజులుగా చిరు జల్లులు కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం ఒక్కసారిగా మారి ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలంలో 15ఐకేపీ కేంద్రాలు, ఏడు పీఏసీఎస్ కేంద్రాలు, రెండు సన్నవడ్ల కేంద్రాలతో మొత్తం 23ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలోని ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోకి రైతులు ధాన్యాన్ని తరలించారు. కొంతమేర ధాన్యం కాంటాలు అయి లారీల్లో మిల్లులకు ఎగుమతి అయింది. రెండు రోజులుగా ఫెంగల్ తుపాన్ ప్రభావంతో చిరుజల్లులు పడుతుండడంతో ఆరబెట్టిన ధాన్యం తడిచిపోతుందోనని ఆందోళనలతో కూలీలను ఏర్పాటు చేసి రైతులు ధాన్యాన్ని గాలి మిషన్లతో తూర్పారా పట్టిస్తున్నారు. వర్షం కారణంగా కూలీలకు డబ్బులు ఎక్కువగా చెల్లించి రైతులు ధాన్యాన్ని శుభ్రం చేయిస్తున్నారు. అర్వపల్లి, కొమ్మాల గ్రామాల్లో మాత్రమే రెండు సన్నవడ్ల కేంద్రాలు ఉన్నాయి. మందకొడిగా సన్న ధాన్యం కాంటాలు అవుతుండడంతో రైతులు చేతికి వచ్చిన పంట ఎక్కడ వర్షాలకు ఆగమవుతుందని ధాన్యం రాశులపై పట్టాలు కప్పుతున్నారు.

యాదగిరికొండపై హరిహరులకు విశేష పూజలు


యాదగిరికొండపై శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో సోమవారం హరిహరులకు విశేష పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు వైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో ఉత్సవమూర్తులను మేల్కొల్పిన అర్చకులు వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీదళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణం జరిపించారు. సాయంత్రంవేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయం ముఖమండపంలో స్ఫటికమూర్తులను అర్చకులు వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతులను పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 34,44,195 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

స్తంభోద్భవునికి విశేష అర్చనలు

మఠంపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మట్టపల్లి లక్ష్మీనృసింహుడి ఆలయంలో స్వామికి సోమవారం విశేష అర్చనలు జరిగాయి. అర్చకులు మూలవర్యులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పుష్పాలంకరణల అనంతరం స్తంభోద్భవునికి ఆరె పత్రితో అష్టోత్తర నామార్చనలు ,యాగ మండపంలో నారసింహ సుదర్శన హోమాలు నిర్వహించారు. క్షేత్ర పాలకుడు ఆంజనేయస్వామికి సహస్ర నాగవల్లి దళార్చన జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత మట్టపల్లి లక్ష్మీనరసింహుని మూర్తులను కల్యాణ వేదికపై అధిష్ఠింపజేసి విశ్వక్సేనారాధన నిర్వహించారు. క్షేత్రంలోని శివాలయంలోనూ బ్రాహ్మీ ముహూర్తంలో ఏకాదశ రుద్రాభిషేకం, పంచాయతన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్ కుమార్, ఈఓ సరికొండ నవీన్ పాల్గొన్నారు.

మదర్‌డెయిరీ పాలకవర్గాన్ని తక్షణమే రద్దుచేయాలి

యాదగిరిగుట్ట రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నష్టాల్లో కొనసాగుతున్న మదర్ డెయిరీ పాలకవర్గాన్ని తక్షణమే రద్దు చేయాలని నార్మూల్ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను చైర్మన్‌గా కొనసాగుతున్న సమయంలో సంవత్సరానికి ఒకసారి డెయిరీ డైరెక్టర్లకు కొన్ని అనివార్య కారణముల చేత ఎన్నికలు నిర్వహించకుంటే డీసీవో పాలకవర్గాన్ని రద్దుచేశారని గత పాలకవర్గంలో సంస్థ రూ. 50కోట్ల నష్టం ఉందని రికార్డులతో సహా డీసీవోకి అందజేసినట్లు చెప్పారు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే డీసీవో నూతన పాలకవర్గం ఎలా కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. నష్టాల్లో ఉన్న సంస్థను ప్రస్తుత డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి లాభాల బాటలోకి తీసుకువస్తారని ప్రశ్నించారు. చైర్మన్ మధుసూదన్‌రెడ్డి లేనిపోని ఆరోపణ చేయడం తగదన్నారు. సమావేశంలో డైరెక్టర్లు మారెడ్డి కొండల్‌రెడ్డి, సందిళ్ల భాస్కర్‌గౌడ్, పాపట్ల నరహరి, పాండవుల భాస్కర్ పాల్గొన్నారు.

రామన్నపేటలో పరిశ్రమ ఏర్పాటు ఉపసంహరించుకోవాలి

రామన్నపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : లగచర్ల, దిలావర్పూర్ మాదిరిగా రామన్నపేటలో ఏర్పాటు చేయనున్న ఆదానీ అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును ఉపసంహ రించుకోవాలని పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ జెల్లెల పెంటయ్య, కోకన్వీనర్ ఎండీ రేహన్ తెలిపారు. రామన్నపేట మండలకేంద్రంలో అఖిలపక్ష పార్టీలతో కలిసి నిరసన కార్యక్రమం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమ పెట్టాలని యత్ని స్తే అడ్డుకొని తీరుతామని అన్నారు. మరో మహా ప్రజా పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు సాల్వేరు అశోక్, బొడ్డుపల్లి వెంకటేశం, జెల్ల వెంకటేశం, ఎండి జమీరుద్దీన్, ఫజల్ బేగ్, కందుల హనుమంతు, పున్న వెంకటేశం, వనం చంద్రశేఖర్, ఎస్కే చాంద్, నకిరెకంటి నరేందర్, నాజర్, గొరిగె సోములు, గురుక శివ, ఆయుధ లక్ష్మణ్, మునికుంట్ల లెనిన్, గొరిగె ఆది, మల్లేష్, శానకొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పరుగు

(5వ పేజీ తరువాయి)

దాదాపు రూ.300కోట్ల వరకు రోడ్లకు కేటాయించగా, నల్లగొండ జిల్లాలో పలు రోడ్లకు మంత్రి శంకుస్థాపనలు చేశారు.

ఉమ్మడి జిల్లాలో ఏడు ఏటీసీలు

ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ బాలుర, నల్లగొండ బాలికల ఐటీఐలు, అనుముల, డిండి, భువనగిరి, ఆలేరు, హుజూర్‌నగర్ ఐటీఐ కాలేజీలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు (ఏటీసీ)గా అభివృద్ధి చేస్తున్నారు. ఒక్కో ఏటీసీకి రూ.34కోట్లతో ల్యాబ్స్, ఇన్‌స్ట్రక్టర్లు, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నారు. విద్యార్థులకు ఉపాధి కల్పించేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్, ఆర్టిఫీషియల్ యూసింగ్ అడ్వాన్స్ టూల్స్, బేసిక్ డిజైనర్ అండ్ పర్సనల్ వెరిఫైర్ (మెకానికల్), రోబోటిక్స్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్, మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ కోర్సులను ఈ ఏటీసీల్లో ప్రవేశపెట్టారు.

ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు శంకుస్థాపన

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. అందుకోసం 25ఎకరాల స్థలంలో భవనాలు నిర్మిస్తోంది. ఉమ్మడి జిల్లాలో నల్లగొండ, మునుగోడు, తిరుమలగిరి, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ఈ స్కూళ్లకు శంకుస్థాపన చేసి పనులు కూడా ప్రారంభించారు.

ఎత్తిపోతల పథకాలపై దృష్టి

నల్లగొండ ఉమ్మడి జిల్లాలో మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జునసాగర్, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలలో నిర్మాణంలో ఉన్న, కొత్తగా శంకుస్థాపనలు చేసిన 16 ఎత్తిపోతల పథకాలను వచ్చే ఆగస్టు 15లోగా పూర్తి చేసి ఆయకట్టుకు నీరందించాలని ఉమ్మడి జిల్లాకే చెందిన రాష్ట్ర భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులకు ఆదేశాలిచ్చారు. అదేవిధంగా మూసీకాల్వలపై ఉన్న ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి, తదితర కాల్వలకు కూడా రూ.565కోట్ల నిధులను మంజూరు చేశారు. వీటితో పాటు నాగార్జునసాగర్ కాల్వల మరమ్మతులకు, ఇతర పనులకు నిధులు మంజూరు చేశారు. మొత్తంగా జిల్లాను సస్యశ్యామలం చేసే అన్ని పథకాలకు నిధుల కొరత లేకుండా అందజేస్తామని మంత్రి వెల్లడించారు.

ప్రారంభానికి సిద్ధమైన 'బ్రాహ్మణవెల్లెంల'



ఎస్ఎల్‌బీసీ పథకంలో అంతర్భాగంగా చేపట్టిన బ్రాహ్మణవెల్లెంల ఎత్తిపోతల పథకంలో తొలిదశలో పనులు పూర్తయ్యాయి. నల్లగొండ, నకిరేకల్, తుంగతుర్తి, మునుగోడు నియోజకవర్గాల్లోని లక్ష ఎకరాలకు నీరిచ్చే ఈ పథకంలో భాగంగా పంప్‌హౌస్, లిఫ్టులు, రిజర్వాయర్ నిర్మాణ పనులు ఇప్పటికే పూర్తవగా, తాజాగా రిజర్వాయర్‌ను నీటితో నింపే ప్రక్రియ కూడా పూర్తిచేశారు. తొలిదశలో 50వేల ఎకరాలకు సాగునీరిచ్చేలా కాల్వల నిర్మాణాలను వేగంగా కొనసాగించారు. ప్రస్తుతం మొదటిదశకు సంబంధించిన పనులు దాదాపు పూర్తవడంతో సీఎం రేవంత్‌రెడ్డితో ఈ ప్రాజెక్టు కాల్వలకు నీరొదిలే కార్యాచరణ మొదలుపెట్టనున్నారు.

6న యాదాద్రి వెలుగు జిలుగులు

దామరచర్ల వద్ద నాలుగువేల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ తొలి యూనిట్‌ను ఈనెల 6న ప్రారంభించేందుకు రంగం సిద్ధమైంది. 800 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం ఉన్న ఈ తొలియూనిట్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని పేర్కొంటున్నారు. ఈ పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన రైల్వేలైన్, బొగ్గు కేటాయింపుల పనులు పూర్తయ్యాయి. ఈనెల 6న లాంఛనంగా విద్యుదుత్పాదన మొదలవుతుంది.



11న ఆరుతడి పంటలకు డిండి ప్రాజెక్టు నీటి విడుదల

- ఆయకట్టు రైతుల ఏకగ్రీవ తీర్మానం


డిండిలో రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ శ్రీధర్‌రావు

డిండి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డిండి ప్రాజెక్టు నీటిని ఈ నెల 11న యాసంగి ఆరుతడి పంటలకు విడుదల చేసేందుకు రైతులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సోమవారం నల్లగొండ జిల్లా డిండి మండలకేంద్రంలోని నీటిపారుదల శాఖ అతిథిగృహంలో ఆ శాఖ ఈఈ శ్రీధర్‌రావు సమక్షంలో నిర్వహించిన సమావేశంలో రైతులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నీటి విడుదలతో ప్రాజెక్టు ఎడమకాల్వ పరిధిలోని 12,500 ఎకరాలకు, కుడి కాల్వ పరిధిలోని 250ఎకరాలకు సాగునీరు అందనుంది. ఆయకట్టు పరిధిలోని సుమారు 6వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఆయకట్టు చివరి భూములు ఉన్న దేవరకొండ మండలం తెలుగుపల్లి గ్రామపరిధిలోని 250 ఎకరాలకు కూడా సాగునీరు అందనుంది. ప్రాజెక్టు గరిష్ఠనీటిమట్టం 36 అడుగులు (2.4 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 36అడుగుల మేర గరిష్ఠస్థాయిలో నీరు నిల్వ ఉంది. ప్రధాన కాల్వ ద్వారా గోనకోలు, డిండి, బొగ్గులదొన గ్రామాల పరిధిలోని 1,200 ఎకరాలు, నార్త్, ఈస్ట్ పరిధిలో ఆరు వేల ఎకరాలు, నార్త్ వెస్ట్ పరిధిలో నాలుగు వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. 2023 వానకాలం ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల కింద 12,750 ఎకరాలు సాగులోకి వచ్చింది. 2024 వానకాలం జూన్‌లో ప్రాజెక్టు నీటి విడుదల చేసే సమయంలో 30 అడుగుల మేరమాత్రమే నీరు నిల్వ ఉంది. సెప్టెంబరు మొదటివారంలో కురిసిన వర్షాలకు డిండి ప్రాజెక్టు అలుగు పోసింది. ఈ వానాకాలం పంటలకు నీరు సరిపోగా ఎగువ నుంచి నీరు వస్తున్న కారణంగా ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ఠస్థాయిలో ఉంది. ఈ యాసంగిలో ప్రాజెక్టులో నీరు ఉండడంతో ఆరుతడి పంటలను వేసుకోవాలని రైతులు తీర్మానించారు. సమావేశంలో డీఈ శ్రీనివాస్, జేఈ సాయికుమార్, రైతులు వెంకటేశ్వరరావు, నాగార్జునరెడ్డి, బుచ్చిరెడ్డి, తిప్పర్తి రుక్మారెడ్డి, కుర్మారెడ్డి, దశరథ రెడ్డి, గోవర్ధన్‌రావు, విజేందర్‌రెడ్డి, ఎండి. షైనొద్దిన్, ఎస్ఆర్.కనకచారి, భాస్కర్‌రావు, పొనగంటి కృష్ణయ్య, డి.నాగేష్, శ్రీనివాస్‌గౌడ్, తండ చంద్రయ్య, దశరథరెడ్డి, తీజ్ పాల్గొన్నారు.

విద్యార్థులు మృతి చెందుతున్నా పట్టించుకోని ప్రభుత్వం


విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

దేవరకొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో కలుషిత ఆహారంతో విద్యార్థులు మృతి చెందుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వామియాదవ్, వేములరాజులు అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొండబీమనపల్లి బీసీ బాలుర, మైనార్టీ, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11 నెలల కాంగ్రెస్ పాలనలో 52మంది విద్యార్థులు కలుషిత ఆహారంతో మృతి చెందారన్నారు. రాష్ట్రంలో 934మంది విద్యార్థులు కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురయ్యారని, అయినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం విద్య, సాంఘిక సంక్షేమశాఖలకు మంత్రులను కేటాయించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ, నాగార్జున, మిధున్, లక్ష్మణ్, మధు, వెంకటేష్ పాల్గొన్నారు.

తెల్లరేషన్‌కార్డుల కోసం ఎదురుచూపు



మోత్కూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలకు తెల్ల రేషన్‌కార్డే ప్రామాణికం కాగా, దశాబ్దకాలంగా కొత్త రేషన్ కార్డుల మంజూరు లేక పేదలు పలు పథకాల్లో లబ్ధి పొందలేకపోతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 10,07,797 రేషన్‌కార్డులు ఉన్నాయి. అందులో యాదాద్రి జిల్లాలో 2,16,945 కార్డులు ఉండగా, 6,25,148 మంది సభ్యులు, సూర్యాపేట జిల్లాలో 3,24,336 కార్డులు ఉండగా, 8,79,990 మంది సభ్యులు, నల్లగొండ జిల్లాలో 4,66,516 కార్డులు ఉండగా, 13,18,103 మంది సభ్యులు ఉన్నారు. నాలుగేళ్లుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 45వేల మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కొత్తగా పెళ్లిళ్లు అయి తల్లిదండ్రులతో వేరుపడిన వారు రేషన్‌కార్డులు లేక, గతంలో కార్డులు జారీ చేసిన తర్వాత జన్మించిన వారి పేర్లు కుటుంబ సభ్యుల జాబితాలో చేర్చక పోవడంతో వారికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందడం లేదు. నూతనంగా ప్రభుత్వం ఇందిర్మ ఇళ్లు ఇవ్వనున్నందున రేషన్ కార్డు లేని వారికి ఇళ్లు వచ్చే అవకాశం లేకుండాపోతుంది. ఆరు గ్యారెంటీలకు దరఖాస్తులు తీసుకున్నప్పుడు రేషన్‌కార్డు లేని వారు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నూతన రేషన్‌కార్డులు ఇవ్వాలని కోరుతున్నారు.

46 ఏళ్ల నిరీక్షణకు తెర

- సీఎం 'ప్రజావాణి'తో దక్కిన పరిష్కారం
- కట్టంగూరు మండలం ఎర్రసానిగూడెం గ్రామానికి చెందిన పిచ్చయ్యకు మంజూరైన పాస్ పుస్తకం


రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యల నుంచి పట్టాదారు పాస్‌పుస్తకం తీసుకుంటున్న పిచ్చయ్య

నల్లగొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఒక ఎకరం సాగు భూమి పట్టాదారు పుస్తకం కోసం 46 ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న రైతు కొమ్మరబోయిన పిచ్చయ్య నిరీక్షణ ముఖ్యమంత్రి ప్రజావాణితో సాకారమైంది. సోమవారం మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యల నుంచి పట్టాపాస్‌పుస్తకం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం ఎర్రసానిగూడెం గ్రామానికి చెందిన కొమ్మనబోయిన పిచ్చయ్య తనకున్న ఎకరం భూమి పట్టా సర్వే నెంబరు 215/3కి సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకం కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటుచేసిన సీఎం ప్రజావాణి విషయం తెలుసుకున్న పిచ్చయ్య పట్టాదారు పాసుపుస్తకం కోసం జూలై నెలలో దరఖాస్తు చేసుకున్నారు. 100 రోజుల్లోనే భూమి పట్టాదారు పాసు పుస్తకం చేతికి అందిందని పిచ్చయ్య ఆనందాన్ని వ్యక్తంచేశారు. తన ఇద్దరు కుమారు నర్సింహ, బొట్టు స్వామియాదవ్‌లతో కలిసి ప్రజావాణి కార్యక్రమానికి హాజరై చిన్నారెడ్డి, దివ్యల నుంచి పట్టాదారు పాసు పుస్తకం తీసుకున్నారు. ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ భరోసా కల్పిసొందని పిచ్చయ్య అన్నారు.

ABC సమాచారం

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుల ఎన్నిక



మేళ్లచెర్వు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మేళ్లచెర్వుకు చెందిన వట్టెపు సైదులు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో జరిగిన పార్టీ మూడో మహాసభల్లో ఆయనను ఎన్నుకున్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు సైదులు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన్‌కల్, (ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా మండలంలోని చిల్పకుంట్లకు చెందిన సీనియర్ నాయకుడు కందాళ శంకర్‌రెడ్డి ఎంపికయ్యారు. సూర్యాపేటలో జరిగిన జిల్లా మహాసభల్లో ఆయనను ఎన్నుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహిస్తామని శంకర్‌రెడ్డి తెలిపారు



కోదాడ రూరల్, (ఆంధ్రజ్యోతి) : సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా మిట్టగణుపుల ముత్యాలు ఎన్నికయ్యారు. పార్టీ జిల్లా మహాసభలో ఆయనను ఎన్నుకున్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు ముత్యాలు కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త కొలువు.. కోటి ఆశలు

సంతోషంగా ఉంది



సివిల్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉంది. 2018 నుంచి టీఎస్ఎస్‌పీలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాను. సివిల్ కానిస్టేబుల్ కోసం ప్రయత్నం చేసి సాధించాను. ఈ ఉద్యోగం ద్వారా ప్రజలకు సేవ చేస్తాను. మా నాన్న జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొంది నేడు డీఏవోగా పని చేస్తున్నారు. ఆయన ప్రోత్సాహం, సలహాలతో ఉద్యోగం సాధించాను. పోలీస్ శాఖలోకి రావడానికి గ్రామానికి చెందిన ఎస్పీ కోటిరెడ్డి సార్ స్ఫూర్తి. సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం రావడంతో కుటుంబ సభ్యులు సంతోషిస్తున్నారు.

- చిక్కుళ్ల డార్విన్, ముకుందాపురం, మునగాల మండలం



తల్లిదండ్రుల కలలు సాకారం చేసేందుకు కష్టపడి చదవివారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మైదానంలో చెమటోడ్చి కొలువు సాధించారు. సమాజానికి సేవ చేయాలని తలంపుతో కానిస్టేబుల్ కొలువులకు దరఖాస్తు చేసుకొని పరీక్షలో మంచి మార్కులు సాధించి శిక్షణకు ఎంపికయ్యారు. తొమ్మిది నెలల పాటు అదిలాబాద్‌లో శిక్షణ పొంది ఇటీవల జిల్లాకు వచ్చారు 281మంది కానిస్టేబుళ్లు. అందులో సివిల్ విభాగంలో 197 మంది ఉండగా 84మంది ఏఆర్ కానిస్టేబుళ్లు ఉన్నారు. సివిల్ విభాగంలో 129మంది పురుషులు, 68 మంది మహిళలు, ఏఆర్ విభాగంలో 65మంది పురుషులు, 19మంది మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారు. కోటి ఆశలతో కొత్త కొలువులోకి అడుగుపెడుతున్న వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే..

- (ఆంధ్రజ్యోతి,సూర్యాపేటక్రైం)

యూనిఫాం సర్వీస్ అంటే చాలా ఇష్టం



మొదటి నుంచి యూనిఫాం సర్వీస్ అంటే చాలా ఇష్టం. మా ఇంట్లో మా చిన్న అన్నయ్య పోలీస్ కావాలనే కోరిక ఎంతో ఉండేది. ఆయన కూడా పోలీస్ శాఖలో ఉద్యోగం కోసం ప్రయత్నం చేశాడు. కానీ ఉద్యోగం రాలేదు. అతడి ప్రోత్సాహంతో నేను కూడా ప్రయత్నం చేసి సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా. నా భర్త ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. నేను ఉద్యోగం సాధించే విషయంలో భర్త సహకారం మరువలేనిది. దీంతో ఉద్యోగం సాధించగలిగాను.

- మందుల త్రివేణి, గుడిబండ, కోదాడ మండలం.

తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు



సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపిక కావడంతో మా తల్లిదండ్రుల ఆనందానికి అవధులులేవు.ఇప్పటికే టీఎస్ఎస్‌పీలో 2021 నుంచి కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తున్నాను. దాని వలన కుటుంబసభ్యులకు కొంతదూరంగా ఉండాల్సి వచ్చింది. అందుకోసం జిల్లాలో ఉద్యోగం అయితే కుటుంబ సభ్యులకు దగ్గరగా ఉండి తల్లిదండ్రుల బాగోగులు చూసుకునే అవకాశముంటుందని సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి సిద్ధమయ్యాను. కొన్నిరోజులు సెలవుపెట్టి సిద్ధం కావడంతో ఉద్యోగం సాధించాను.

- పోతుకునూరి భరత్, కట్టకమ్మగూడెం, కోదాడ మండలం.

కూలి పనులు చేసి చదివించారు



మాది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేసి చదివించారు. వ్యవసాయ కుటుంబమైనా పోలీస్ శాఖలో ఉద్యోగం చేయాలనే కోరిక తల్లిదండ్రులకు ఉంది. వారి కోరిక మేరకు సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం కోసం సిద్ధమయ్యాను. కష్టపడి చదవడం, మైదానంలో ఈవెంట్స్ ప్రాక్టీస్ చేయడంతో ఉద్యోగం పొందాను. ఉద్యోగంలో అంకితభావంతో నిజాయితీగా విధులు నిర్వహించి మంచి పేరు సంపాదిస్తా.

- కుసుమ ప్రియాంక, లక్ష్మీపురం, గరిడేపల్లి మండలం.

నర్సరీల్లో మొక్కలు పెంచాలి

అర్వపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నర్సరీల్లో మొక్కలు పెంచాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని రామన్నగూడెంలో నర్సరీని, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని సోమవారం పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందజేయాలన్నారు.

పారిశుధ్య సిబ్బందికి వైద్య శిబిరం

నేరేడుచర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సోమవారం నేరేడుచర్ల మున్సిపాలిటీలోని సిబ్బందికి ప్రైవేట్ ల్యాబ్ ఆధ్వర్యంలో ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. సిబ్బంది ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, కౌన్సిలర్లు కొణతం చిన వెంకటరెడ్డి, తాళ్లూరి సాయి ఉన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

చివ్వెంల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇవ్వాల్సిన ట్యూషన్ ఫీజు బకాయిలను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బానోతు వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ట్యూషన్ బకాయిలు విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారన్నారు. కార్యక్రమంలో అక్కినేపల్లి వినయ్, అనిల్, శ్రీను, వంశీ, శివ, మహేష్ ఉన్నారు.

ఆధ్యాత్మిక శోభ



హుజూర్‌నగర్‌లో వాసవీమాతకు పూజలు



నేరేడుచర్లలోని శివాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

మేళ్లచెర్వు, సూర్యాపేట టౌన్, హుజూర్‌నగర్, హుజూర్‌నగర్ రూరల్, నేరేడుచర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మేళ్లచెర్వులోని ఇష్టకామేశ్వరి సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. జిల్లాకేంద్రంలోని శ్రీఅన్నపూర్ణసహిత విశ్వనాథస్వామి దేవాలయం, రామలింగేశ్వరస్వామి దేవాలయం, సంతోషిమాత దేవాలయం, పాత శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని వాసవీమాత దేవాలయంలో గౌరీ పాడ్యమి సందర్భంగా అమ్మవారికి సారె, చీరెలు సమర్పించి పూజలు చేశారు. నేరేడుచర్ల, సోమప్ప శివాలయాలలో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



మేళ్లచెర్వులో క్యూలైన్‌లో నిలుచున్న భక్తులు



సూర్యాపేటలో కార్తీక మాసం పూజల్లో పాల్గొన్న భక్తులు

ఎయిడ్స్ నిర్మూలనకు సహకరించాలి

సూర్యాపేటటౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డిస్ట్రిక్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ పి. శ్రీవాణి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా జిల్లాకేంద్రంలో సోమవారం నిర్వహించిన ర్యాలీని ప్రారంభించారు. ప్రతి ఒక్కరు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి గర్భిణి ఎయిడ్స్ పరీక్షలు చేయించుకోవాలని, పుట్టబోయే బిడ్డకు సురక్షితమైన జీవితం అందించాలన్నారు.

గరిడేపల్లి: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. ప్రసన్నకుమారి అన్నారు. మండలంలోని గడ్డిపల్లిలో ఆదర్శ పాఠశాల విద్యార్థులతో వీధుల్లో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కఠినంగా శిక్షించాలి

సూర్యాపేట(కలెక్టరేట్), డిసెంబరు 2,(ఆంధ్రజ్యోతి): అనంతగిరి మండలంలోని శాంతినగర్ వద్ద పదో తరగతి చదువుతున్న హాస్టల్ విద్యార్థి మృతికి కారణమైన వారిని శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, బానోత్ వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో సంఘం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ రాంబాబుకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.

కళాప్రదర్శనలతో ఉద్యమాలకు ఊపిరి

సూర్యాపేటటౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కళాప్రదర్శనలతో ఉద్యమాలు నిర్వహిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. జిల్లాకేంద్రంలో సోమవారం జరిగిన తెలంగాణ ప్రజానాట్యమండలి కళాకారుల శిక్షణ శిబిరంలో మాట్లాడారు. కళలు ప్రజాచైతన్యానికి ఆయుధమన్నారు. సామాజిక రుగ్మతలపై ప్రజలను చైతన్య పర్చాల్సిన బాధ్యత కళాకారులపై ఉందన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కె. శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో రెండు దశాబ్దాలుగా భారత రాజకీయాల్లో మతం పెరిగిపోయిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, నాయకులు బూర వెంకటేశ్వర్లు, దూళిపాళ ధనుంజయనాయుడు, గుండు వెంకటేశ్వర్లు, జంపాల మల్లయ్య, సత్యనారాయణ, బొమ్మగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దు

భానుపురి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితాలతో చెలగాట మొద్దని మునిసిపల్ ఛైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ అన్నారు. బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని హాస్టళ్లను సోమవారం పరిశీలించారు. గురుకుల పాఠశాలల్లో భోజనం, వసతి విషయంలో నాణ్యత ప్రమాణాలు పెంచాలన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్‌కు ధీటుగా విద్య అందించాలన్న సంకల్పంతో మాజీ సీఎం కేసీఆర్ గురుకులాలను బలోపేతం చేశారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ ముదిరెడ్డి అనిల్‌రెడ్డి,కుమార్, నెమ్మాది శ్రవణ్‌కుమార్, బానోతు సురేష్‌నాయక్, గుండాల సందీప్, వడ్లేపల్లి సందీప్, వేల్పుకొండ రామకృష్ణ, జానకిరాములు, మధు ఉన్నారు.

'అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి'

మఠంపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మఠంపల్లి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ మన్నెం శ్రీనివాస్‌రెడ్డి అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో మండల అధ్యక్షుడు భూక్య మంజూనాయక్, మాజీ జడ్పీటీసీ సింగారపు అరుణసైదులు, మఠంపల్లి మాజీ సర్పంచ్ ఆధూరి స్రవంతికిషోర్ మాట్లాడారు. మఠంపల్లి సర్పంచ్‌గా శ్రీనివాస్‌రెడ్డి స్థానిక సాగర్ పరిశ్రమ అందించిన వాటర్ ట్యాంకర్‌ను అప్పటి పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, వార్డు మెంబర్ భర్త ఆరోగ్యరెడ్డి నాలుగు సంవత్సరాలుగా మరో పరిశ్రమలో లీజు కుదుర్చుకొని వాటలు పంచుకున్నారని ఆరోపించారు. సాగర్ సిమెంట్ వారు మహిళా సంఘాల కోసం రెండు గుంటల స్థలం కేటాయిస్తే ఆ స్థలాన్ని రాజకీయ అండదండలతో కబ్జా చేసి తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు బచ్చలకూరి బాబు, మాలోతు సక్రు నాయక్, ఎం.కొండానాయక్, మల్లికంటి బుచ్చయ్య, లూర్థుమార్రెడ్డి, అంతోన్‌రెడ్డి, ఎల్లారెడ్డి, పిచ్చిరెడ్డి, అప్పరావు, కరీం, రాయల్, కృపానందం, శౌరి, గోపయ్య, రాములు, దుర్గయ్య పాల్గొన్నారు.

సర్వే చేయాలి

సూర్యాపేట(కలెక్టరేట్), డిసెంబరు 2, (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట మునిసిపాలిటీ పరిధిలోని కుడకుడ శివారులో గల ప్రభుత్వ భూమి సర్వే నెంబరు 126, నేరేడుచర్లలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబరు 243,244లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఆరేళ్ల నుంచి పేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. కేవలం ఇంటి నెంబరు లేనంత మాత్రానా సర్వే చేయకుండా వదిలివేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేణుక, అఖిల్‌కుమార్, హుస్సేన్, మోహన్, జాన్‌సుందర్, రజాక్, సైదులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సూర్యాపేట(కలెక్టరేట్), డిసెంబరు 2, (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వీఆర్‌ఏల వారసులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2020 సెప్టెంబరు 9న గత ప్రభుత్వం వీఆర్‌ఏలకు పేస్కేల్, వారసులకు ఉద్యోగాలు ఇస్తామని అసెంబ్లీలో ప్రకటించారని గుర్తుచేశారు. వీఆర్‌ఏల్లో డిగ్రీ చదివిన వారిని జూనియర్ అసిస్టెంట్‌లుగా, ఇంటర్ చదివిన వారిని రికార్డు అసిస్టెంట్లుగా, పదవ తరగతిలోపు చదివిన వారిని ఆఫీస్ సబార్డినేట్లుగా రెవెన్యూ మునిసిపల్, ఇరిగేషన్, మిషన్‌భగీరథతో పాటు పలు శాఖల్లో వీఆర్‌ఏలను సర్దుబాటు చేసిందని తెలిపారు. ప్రభుత్వం అప్పట్లో విడుదల చేసిన జీవో మేరకు 3793 మంది వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగ నియామక ఉత్తర్వులు ఇవ్వకుండా కాలయాపన చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. 61ఏళ్లు నిండిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగం ఇవ్వడం వలన చదువుకున్న యువత ప్రభుత్వ శాఖల్లోకి వస్తారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు, వారి వారసులు

భగవద్గీత కంఠస్థ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నూతన్‌కల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో మండల పరిధిలోని పెదనేమిల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. సోమవారం సూర్యాపేటలో నిర్వహించిన పోటీలో వల్లమల్ల అనన్య, మేన లక్ష్మి, మన్నెం సిందూజలు ప్రతిభ కనబర్చారు. వారికి నిర్వహాకులు మెమోంటోలతో సత్కరించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి. శివయ్య తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించిన తెలుగు ఉపాధ్యాయురాలు ప్రశాంతిని, హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

సంక్షేమ బోర్డు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కోదాడ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ బోర్డు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన మండల మార్బుల్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాయడమే కాకుండా పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రైవేట్‌వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన గాడితప్పిందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ లతీఫ్, యూనియన్ నాయకులు అచ్చయ్య, అజీజ్ పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సందానం రామారావు, ఉపాధ్యక్షులుగా షేక్ మీరా, ప్రధాన కార్యదర్శిగా షేక్ పాషా, సహాయ కార్యదర్శిగా శీలం సైదులు, కోశాధికారిగా అత్తిలి వీరబాబు, గౌరవ అధ్యక్షులుగా అచ్చయ్య, ఎండీ. అజీజ్ ఎన్నికయ్యారు.

వ్యవసాయ కార్మికులకు పింఛన్ అమలు చేయాలి

సూర్యాపేట(కలెక్టరేట్), (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12వేల చొప్పున పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు పేర్ల నాగయ్య డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ కార్మికులకు పెన్షన్ పథకాన్ని అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా నేటికీ అమలు చేయడం లేదన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్ రాంబాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కారింగుల వెంకన్న, హుస్సేన్, లింగయ్య, రమేష్, ప్రసాద్, శంకర్, రాజ్‌కుమార్, మోహన్, జాన్‌సుందర్, ఉపేందర్ , విజయ్, శ్రీను, సైదులు, రజాక్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ సరైన విధానం కాదు

హుజూర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేయడం సరైన విధానం కాదని ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బాబూరావు అన్నారు. సోమవారం పట్టణంలోని టౌన్‌హాల్‌లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సింహగర్జన విజయవంతమైందన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. సమావేశంలో ఇట్టిమళ్ల బెంజిమెన్, కోలపూడి దయాకర్, పుల్లయ్య, రాములు, పున్నయ్య, అరుణ్, మధు, ప్రకాశ్‌నర్సింహారావు, ఏసు, వినోద్, రాజా, ప్రభు, బాబు, దశరథ, పాపారావు, అరుణ, రవి పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

తుంగతుర్తి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే ఆరు గ్యారెంటీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంస్కృతిక సారథి టీం లీడర్ ఈర్ల సైదులు అన్నారు. మండలంలోని కాశితండా, జొన్నలగడ్డతండా, బోడబండ గ్రామాల్లో ప్రజాపాలన సంస్కృతి సారథి కళాయాత్ర ఆధ్వర్యంలో సోమవారం కళాజాతా నిర్వహించారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రూ.2 లక్షల రుణమాఫీ, ఉచిత విద్యుత్, యువతకు ఉద్యోగాలు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు పథకాలు ప్రజలకు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో సంస్కృతిక సారథి కళాకారులు గడ్డం ఉదయ్, వెన్నెల నాగరాజు, పాలకుర్తి శ్రీకాంత్, శంకర్, ఉపేందర్ పాల్గొన్నారు.

గరిడేపల్లి: ప్రజల రక్షణ కోసం పోలీసులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్ఐ చలికంటి నరేష్ అన్నారు. నూతనంగా విధుల్లో కానిస్టేబుళ్లనుద్దేశించి మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాలు అమలు చేస్తూ నిర్వహణలో పేరు తెచ్చుకోవాలన్నారు.

కోదాడటౌన్, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈవో సలీంషరీఫ్ అన్నారు. రాష్ట్రస్థాయి అథెట్లిక్స్‌కు ఎంపికైన సూర్యాపేట జిల్లా కోదాడ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు డి. మార్కండేయ, బీసీ హాస్టల్ హెడ్ కుక్ అనంతలక్ష్మీ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుంగతుర్తి, (ఆంధ్రజ్యోతి) : అండెం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నారం గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు రూ.35వేలు విలువ చేసే విద్యుత్ సామాగ్రిని అందజేశారు. ఫౌండేషన్ సభ్యుడు వెంకటోరెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్యాంప్రసాద్, అనూఖ్, రాయుడు, యేసు, సతీష్, రాములు, వెంకన్న పాల్గొన్నారు.

మఠంపల్లి, (ఆంధ్రజ్యోతి): చెన్నాయి పాలెంతండాకు చెందిన బానోతు శంకర్‌నాయక్ విద్యుదాఘాతంతో మృతిచెందడం బాధాకరమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య మంజూనాయక్ అన్నారు. శంకర్‌నాయక్ మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను సానుభూతి తెలిపారు.

తిరుమలగిరి, (ఆంధ్రజ్యోతి): అనంతగిరి మండలంలో గిరిజన విద్యార్థి తిరుమలేష్ మృతికి కారణమైన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు ధరావత్ సంతోష్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

సంక్షిప్త సమాచారం...

హుజూర్‌నగర్ రూరల్, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సోమవారం ఓపెన్ ఐస్ సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేదలైన 50 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. పట్టణంలోని దీక్షిత్‌నగర్ ప్రాంతంలో తాత్కాలిక గుడెసలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న 50 కుటుంబాలకు సుమారు 10వేల విలువైన దుప్పట్లు, రగ్గులను ఓపెన్ ఐస్ సొసైటీ ప్రధానకార్యదర్శి సులువ శ్రీనివాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సులువ చంద్రశేఖర్, శివశంకర్, రామిశెట్టి శ్రీనివాస్, కృష్ణ, కలామ్, రమేష్, సంపత్, శ్రీకాంత్, రాంబాబు, రవి పాల్గొన్నారు.

చిలుకూరు, (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మండలకేంద్రంలో చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సాతులూరి గురవయ్య, నాయకులు కొల్లూరి నర్సయ్య, కొండా సోమయ్య, కొల్లు సత్యనారాయణ, మరీదు శ్రీను ఉన్నారు.

మఠంపల్లి: మఠంపల్లి మండల కార్పెంటర్ల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాళ్ళూరి జనార్ధన్‌చారి, ఉపాధ్యక్షుడిగా వంశీకృష్ణచారి, ప్రధాన కార్యదర్శిగా శంభయ్యచారి, కోశాధికారిగా గోధుమల మధుచారిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వీరచారి, వీరబ్రహ్మం, ప్రసాద్‌చారి, క్రాంతిచారి, పరిపూర్ణచారి, రామయ్యచారి, నాగబ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల, (ఆంధ్రజ్యోతి): నేరేడుచర్లలోని ఎస్టీ బాలుర వసతి గృహం విద్యార్థులకు తహసీల్దార్ సైదులు రగ్గులు పంపిణీ చేశారు. కష్టపడి చదువుకోవాలని కోరారు. నాణ్యమైన మెనూ అందించాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్ చందూలాల్, సిబ్బంది పాల్గొన్నారు.

తుంగతుర్తి, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మండలకేంద్రానికి చెందిన ఓరుగంటి సత్యనారాయణ అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన పార్థీవదేహానికి పూలమాల వేసి పలువురు నివాలులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే మందుల సామేలు, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్, సంకినేని రవీందర్‌రావు, తుంగతుర్తి మార్కెట్ ఛైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ గుడిపాటి సైదులు, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ చింతకుంట్ల వెంకన్న, తాడోజు వాణిశ్రీకాంత్‌రాజు ఉన్నారు. సత్యనారాయణ కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు.

మద్దిరాల, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు రమేష్ జూనియర్ లెక్చరర్ ఉద్యోగం సాధించినందుకు ఉపాధ్యాయులు, మాజీ ప్రజాప్రతినిధులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయుడు వడ్దాణం మధుసూదన్, మాజీ ఉపసర్పంచ్ మల్లాల నర్సయ్య, భూతం వీరమల్లు, మల్లాల రాంమూర్తి పాల్గొన్నారు.

తిరుమలగిరి, (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కటుకూరి రమేష్ తల్లి లక్ష్మమ్మ మృతిచెందారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సంకెపల్లి సుధీర్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సాయం ప్రకటించారు. సోమవారం మండల కాంగ్రెస్ నాయకులు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. సంతాపం తెలిపిన వారిలో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సంకెపల్లి కొండల్‌రెడ్డి, ఖలీం, బత్తుల శ్రీను, జితేందర్, గాదరబోయిన లింగయ్య రమేష్‌రెడ్డి, వెంకన్న ఉన్నారు.

సర్వమతాల సారాంశం ఒక్కటే

సూర్యాపేటటౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సర్వమతాల సారాంశం ఒక్కటేనని 40వార్డు కౌన్సిలర్ తాహెర్‌పాషా, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని 40వార్డు కౌన్సిలర్ తాహెర్‌పాషా నివాసంలో ఏర్పాటు చేసిన అన్నిమాలాదార స్వాములకు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మతాలు పట్టింపు ఉన్నవారికే అని మానవత వాదులకు కాదని స్పష్టం చేశారు. ఈసందర్భంగ అన్నిమాలాదార స్వాములకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.



అయ్యప్ప స్వాములకు అన్నదానం చేస్తున్న కౌన్సిలర్ తాహెర్‌పాషా

ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం

చివ్వెంల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని బెతేస్థ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు పాస్టర్ దుర్గం ప్రభాకర్, అంతర్జాతీయ ప్రసంగికులు జాషువా అన్నారు. సోమవారం మండలంలోని ఖాసీంపేటలో బెతేస్థ మందిరంలో సెమిక్రిస్మస్ వేడుకల్లో భాగంగా కేక్‌కట్ చేసి నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ప్రపంచశాంతి కోసం ప్రతి ఒక్కరూ ప్రార్థించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్‌లు ఇరుగు శాంసన్, ఇంజమూరి గాబ్రియేలు, జలగం జెమ్స్ యేషయా, బొక్కఏలియారాజు, యల్కా ప్రభాకర్, ఏర్పుల క్రిస్టోఫర్, జాన్‌ప్రకాష్, గుంటూరుబాబు, పందిమార్కు, రూబెన్, కొండేటి లాజర్, హోసన్న, కిరణ్‌బాబు, పుల్లూరి బోయాజ్ పాల్గొన్నారు.